క్లుప్తంగా

10, 11 తేదీల్లో జగనన్న సంక్రాంతి సంబరాలు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఈ నెల 10, 11వ తేదీల్లో పట్టణంలోని 21వ వార్డు పరిధి రావికంటిపేటలో జగనన్న సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేల నగదును అందజేస్తామన్నారు. రంగవళ్లుల పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు భానుప్రకాష్ (9963539264), రాఘవేంద్రరావు (9640992916)ను సంప్రదించాలన్నారు.

ఎల్సీడీసీ సర్వే పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యాధికారి శ్రీకాంత్

జలుమూరు: ఎల్సీడీసీ సర్వేను గ్రామాల్లో పక్కాగా నిర్వహించాలని జిల్లా అదనపు వైద్యశాఖ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం జలుమూరు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి రెండు వరకు జరగనున్న ఈ సర్వే ఇంటింటా నిర్వహించాలన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది ముఖ హాజరు నిర్దేశించిన సమయంలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్ కుమార్, సీహెచ్ఓ పద్మావతి, హెచ్ఎస్ చిన్నరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీలో విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నరసన్నపేట: నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 3 నుంచి 6 వతేదీ వరకు పోలాకి మండలం మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రిగ్స్ పోటీలు జరిగాయి. దీంట్లో స్థానిక శ్రీజ్ఞానజ్యోతి విద్యార్థులు కబడ్డీలో విజేతలుగా నిలిచారు. విద్యార్థులకు స్కూల్ యాజమాన్య ప్రతినిధులు రామారావు, భాస్కరరావు అభినందించారు. షాట్‌పుట్‌లో ఉమాశంకర్ ద్వితీయ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో రాజేష్ మూడో స్థానంలో నిలిచారని రామారావు తెలిపారు.

'ఇప్పిలి'కి నేషనల్ అవార్డు



వేణుగోపాలరావుకు అవార్డు అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

జలుమూరు: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇప్పిలి వేణుగోపాలరావుకు రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ నేషనల్ బిల్డర్ టీచర్ అవార్డు ప్రకటించింది. మంగళవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు క్యాంప్ కార్యాలయం (శ్రీకాకుళంలోని)లో అవార్డు అందించారు. రోటరీ అధ్యక్షురాలు తేజలక్ష్మి, కార్యదర్శి రావిబాబు ఉన్నారు.

పింఛన్‌దారుల అర్హతల పరిశీలన



హిరమండలంలో దివ్యాంగుడి అర్హతలపై ఆరా తీస్తున్న వైద్యులు

హిరమండలం: మండలంలోని గులుమూరు, ఎం.ఎల్.పురం, హిరమండలం గ్రామాల్లోని దివ్యాంగ పింఛన్‌దారుల అర్హతలను వైద్యుల బృందం మంగళవారం పరిశీలించింది. వారి అర్హత తెలిపే ధ్రువపత్రాలను చూసి ధ్రువీకరించారు. అనర్హులు పింఛన్ డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పరిశీలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: మండల పరిధిలోని 12 రేషన్ డిపోలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సివిల్ సప్లై డీటీ రామకృష్ణ మంగళవారం తెలిపారు. కొత్తపోలవలస, పోతయ్యవలస, మడపాం, శ్రీరాంపురం, నరసన్నపేట టౌన్‌లో బండి వీధి, దేశవానిపేట, హడ్కో కాలనీ, కొత్తవీధి నుంచి దరఖాస్తులను రిజర్వేషన్లు మేరకు చేసుకోవచ్చన్నారు. కొత్తగా పెద్దపేట, వీరన్నాయుడు కాలనీ, పురుషోత్తంనగర్, మార్కెట్ వీధుల్లో డిపోలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటికి కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.



పాతపట్నం: పాతపట్నం-తెంబూరు రోడ్డులో గంగువాడ వద్ద మరమ్మతులు చేయకుండా వదిలేసిన బీటీ రోడ్డు



హిరమండలం: గొట్టా-నివగాం రహదారిలో తూతూ మంత్రంగా చేపడుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులు

రహదారులను వెంటనే బాగుచేయాలి



నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం కష్టంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆర్‌అండ్‌బీ రోడ్లలో పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడినా పూడ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం సరికాదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోడ్లను వెంటనే బాగుచేయాలి.

– బి.నారాయణమూర్తి, దుర్గమ్మగుడి కాలనీ, పాతపట్నం



హిరమండలం: ఏబీ రహదారిలో కొండరాగోల వద్ద బెర్ములు వేయని దృశ్యం

మరమ్మతుల పేరుతో..

నిధుల మేత!

- నాసిరకంగా రోడ్ల పనులు చేసి రూ.లక్షల్లో బిల్లుల స్వాహా
- గుంతలు పూడ్చుతున్నామంటూ కూటమి ప్రభుత్వం ఆర్భాటం



ఎల్.ఎన్.పేట: బొర్రంపేట వద్ద మట్టి రోడ్డుగా ఉన్న అలికాం - బత్తిలి (ఏబీ) ప్రధాన రోడ్డు

సంక్రాంతి కల్లా చక్కటి రోడ్లు.. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతేడాది సెప్టెంబర్ మొదటి వారంలో చెప్పిన మాట. పెద్ద పండగకు గ్రామాలకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని ఊదరగొట్టారు. ఆర్‌అండ్‌బీ, గ్రామీణ రోడ్లను పరిశీలిస్తే వాస్తవం మరోలా ఉంది. జిల్లాలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన ఎల్.ఎన్.పేట మండలంలోని అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డు గోతులమయంగా ఉంది. నిధులు మంజూరు చేశామని చెబుతున్నా.. పాలకులు మాత్రం రహదారులను మరమ్మతులు చేపట్టడంలోనూ, పక్కా రోడ్లు వేయటంలోనూ నిర్లక్ష్యం చూపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రహదారి పనులు నాసిరకంగా చేపట్టి రూ.లక్షల్లో నిధులు దోచేస్తున్నారని విమర్శిస్తున్నారు. సీఎం చంద్రబాబు వేదికలపై చెప్పే మాటలకు.. వాస్తవాలకు పొంతన ఉండదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని రోడ్లపై ప్రయాణించాలంటే నరకం చూస్తున్నామని ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నిధులు మంజూరైనా ఎల్.ఎన్.పేట మండలంలో రహదారి పనులు ఇంతవరకు ప్రారంభించలేదు. - సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: గొప్పిలి గ్రామం వద్ద గోతులమయంగా రహదారి



ఎల్.ఎన్.పేట: అలికాం-బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారిలో బప్పడాం జంక్షన్ వద్ద చెరువును తలపించేలా గొయ్యి

పాతపట్నం నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతుల వివరాలు ఇలా..

మండలం	ఆర్‌అండ్‌బీ రోడ్లు	మరమ్మతులు చేయాల్సినవి	మంజూరైన నిధులు
పాతపట్నం	4	2	రూ.60.80 లక్షలు
ఎల్.ఎన్.పేట	9	9	రూ.76.30 లక్షలు
హిరమండలం	3	3	రూ.40.00 లక్షలు
మెళియాపుట్టి	5	5	రూ.24.50 లక్షలు
కొత్తూరు	6	6	రూ.50.00 లక్షలు

పాతపట్నం నియోజకవర్గంలో ఉపాధి నిర్మాణ పనులు (పీఆర్ రోడ్ల నిర్మాణం) వివరాలు ఇలా..

మండలం	పంచాయతీలు	రోడ్లు	మంజూరైన నిధులు
పాతపట్నం	34	91	రూ.5.26 కోట్లు
ఎల్.ఎన్.పేట	22	66	రూ.3.78 కోట్లు
హిరమండలం	23	51	రూ.3.60 కోట్లు
మెళియాపుట్టి	37	85	రూ.4.57 కోట్లు
కొత్తూరు	43	100	రూ. 4.09 కోట్లు



కొత్తూరు: రామకృష్ణాపురం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డులో గోతులు పూడ్చని వైనం



కొత్తూరు: అంగూరు సమీపంలో నాణ్యత లేని ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు



పాతపట్నం: పాతపట్నం-మెళియాపుట్టి రోడ్డులో తిడ్డిమి వద్ద గతులతో ఉన్న బీటీ రోడ్డు

ముమ్మర తనిఖీలు



ఈ చిత్రం మెళియాపుట్టి మండలంలోని చాపర గ్రామంలోని కిరాణా షాపులో జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు. మెళియాపుట్టి మండలంలోని చాపర, మెళియాపుట్టిలోని పలు కిరాణా, పాన్ షాపులు, ఇతర ప్రదేశాల్లో గంజాయి, నిషేధిత మత్తుపదార్థాలు గుర్తుపట్టడానికి ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసు జాగిలంతో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. బస్సులు, కార్లు, ఇతర వాహనాలను సైతం జాగిలంతో క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే సమాచారం అందజేయాలని ప్రజలను కోరారు. పోలీస్‌లు పాల్గొన్నారు. -మెళియాపుట్టి

వామన అవతారంలో..



సారవకోట మండలంలోని చీడిపూడి కల్యాణ వేంకటేశ్వర స్వామిని శనివారం వామన అవతారంలో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో గత కొన్ని రోజుల నుంచి జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక, విశేష పూజలు చేసినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు. - సారవకోట

మేలుకొలుపు..



సారవకోట మండల కేంద్రంలో ధనుర్మాసం పురస్కరించుకుని మంగళవార ఉదయం మేలుకొలుపు నిర్వహించారు. సారవకోట గ్రామానికి చెందిన శ్రీవేంకటేశ్వర భజన బృందం సభ్యులు ప్రతీరోజు తెల్లవారు జామున సీతారాముల పట్టాభిషేకం చిత్రపటం పట్టుకుని మెలుకొలుపు నిర్వహిస్తున్నారు. సుమారు 60 ఏళ్ల నుంచి ప్రతిఏటా మేలుకొలుపు నిర్వహిస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. వీరితోపాటు మరో రెండు బృందాల వారు మెలుకొలుపు నిర్వహిస్తున్నారు. - సారవకోట

రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతి

నరసన్నపేట: మండలంలోని జమ్ము పంచాయతీ పొన్నాడపేట రోడ్డు నిర్మాణం సజావుగా జరిగేలా అధికారులు చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. మంగళవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పొన్నాడపేట వాసులు మాట్లాడుతూ 1973 నుంచి తమ గ్రామానికి రోడ్డు ఉందన్నారు. ఈ ప్రభుత్వం సీసీ రోడ్డు మంజూరు చేసిందని, పనులు జరుగుతుండగా జమ్ముకు చెందిన కొందరు వచ్చి రోడ్డు వారి భూ భాగంలో ఉందని అడ్డుకున్నారన్నారు. అధికారులు వెంటనే పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. పొన్నాడ రామభద్రరావు, పొన్నాడ సుందరరావు, గంగు పసరయ్య, పి.అప్పన్న తదితరులున్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



మెళియాపుట్టి: చాపరలో కరణం శశిభూషణరావును పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

మెళియాపుట్టి: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం పరామర్శించారు. పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఉర్లాన హంసమ్మ మామ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉర్లాన రుషి తండ్రి లక్ష్మీనారాయణ ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబాన్ని, ఇదే గ్రామంలో మాజీ వలంటీర్ భారతి మామయ్య పుణ్యపాత్రో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. హీరాపురం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు లక్ష్మీపురం ఉమాశంకర్(చిన్నారావు) తల్లి గౌరమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చాపర గ్రామానికి చెందిన కరణం శశిభూషణరావు (వైఎస్సార్‌సీపీ మండల ఉప కన్వీనర్) అనారోగ్యంతో చికిత్సపొందారు. ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. పట్టుపురం సర్పంచ్ సంపతిరావు లక్ష్మి భర్త రామచంద్రరావుకు గుండె శస్త్రచికిత్స చేసుకోవడంతో ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, పార్టీ మండల కన్వీనర్ పల్లి యోగి, చాపర సర్పంచ్ రామారావు, పలువురు ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

సంక్షిప్తంగా

వివాహాలకు పురోహితులు హాజరయ్యేలా చూడండి

నరుబుజ్జిలి: దళితుల వివాహాలకు పురోహితులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు తోట రాములు అన్నారు. ఈ మేరకు సమస్యను స్థానిక పోలీస్‌లు, తహసీల్దార్ దృష్టికి మంగళవారం తెచ్చారు. దళిత సంఘాల నేతలు ఇల్లాకుల సూర్యప్రకాశరావు, అదపాక గౌరినాయుడు, ఎడ్ల ఈశ్వరరావు, గుర్రాల చిన్నబాబు, ప్రభాకర్, రాజారావు ఉన్నారు.

ఏపీజీవీబీ స్కీమ్‌లపై అవగాహన

నరుబుజ్జిలి: ఏపీజీవీబీ ద్వారా ప్రజలకు అందిస్తున్న స్కీమ్‌లు సద్వినియోగం చేసుకోవాలని పురుషోత్తపురం బ్రాంచ్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. మంగళవారం గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్నామన్నారు. వయోవృద్ధులకు రికరింగ్ డిపాజిట్లపై 8.10 శాతం, సాధారణ పౌరులకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7.60 శాతం వడ్డీ అందిస్తున్నామన్నారు. ఒకటి నుంచి రెండేళ్ల కాల వ్యవధి గల వికాస్ ధనరత్న డిపాజిట్లపై అత్యధిక వడ్డీ అందజేస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్షిద్దాం.. చదివిద్దాం

జలుమూరు: బాలికలను రక్షించి వారిని చదివించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని చైల్డ్‌లైన్ పర్యవేక్షకుడు ఎస్.వైకుంఠరావు అన్నారు. మంగళవారం తిమడాం ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. బాలికలకు ఇబ్బంది కలిగితే 1098 ఫోన్‌కు చేసి సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు నేరమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆమదాలవలస: చిన్నజొన్నవలసలో నిరాశ్రయులు అయిన బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి తనవంతు కృషిచేస్తానని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారిగాంధీ అన్నారు. మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కోర్టు ఉత్తర్వులు వచ్చి సంవత్సరం నాలుగు నెలలు అయినప్పటికీ వారి పరిస్థితి గురించి ప్రభుత్వ అధికారులు పెడచెవిన పెట్టడం సమంజసం కాదన్నారు. రాజ్యాంగంలో ప్రతి పౌరుడు జీవించే హక్కు ఉన్నప్పటికీ వారికి ప్రత్యామ్నాయంగా ఇళ్లను ఏర్పాటు చేయకుండా రోడ్డు మీద పడే దుస్థితికి తీసుకురావడం దారుణమన్నారు.

కాటాలకు సీళ్లు..

నరసన్నపేట: వ్యాపారులు కాటాలకు విధిగా సీళ్లు వేయించుకోవాలని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ రాజారమేష్ అన్నారు. స్థానిక సౌభాగ్యలక్ష్మి కల్యాణ మండపంలో మంగళవారం వందకు పైగా కాటాలను సరి చేసి సీళ్లు వేయించారు. విరిగిన కాటాలు, సీళ్లు వేయని గుళ్లు వాడితే చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులకు అనుమానం ఉంటే తమకు తెలియజేయాలన్నారు.

13 నుంచి కరవంజ జాతర



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

జలుమూరు: ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి పురస్కరించుకుని కరవంజ జాతర నిర్వహించనున్నారు. కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా పోస్టర్‌ను గ్రామ పెద్దలు మంగళవారం ఆవిష్కరించారు. మూడు రోజులపాటు జరగనున్న జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. 13న ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు, 14న మధ్యాహ్నం జిల్లా స్థాయి బల ప్రదర్శన (వెయిట్ లిఫ్టింగ్, సంగిడీ) పోటీలు ఉంటాయన్నారు. సర్పంచ్ జుత్తు నేతాజీ, నీటి సంఘం అధ్యక్షుడు జుత్తు అప్పల నాయుడు, నీటి సంఘం డైరెక్టర్ శ్రీరాములు, సంపతిరావు రామారావు, టి.వి.కె.ప్రసాద్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు 'సి' గ్రామ పంచాయతీ పరిధిలోని సవర మర్రిపాడులో తాగునీరు, రహదారి నిర్మాణం, తదితర సమస్యలపై 'అభివృద్ధికి ఆమడ దూరం' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పనిచేయని చేతిపంపు హెడ్‌ను తొలగించి మోటారు బిగించారు. ట్యాంక్ ఏర్పాటు చేసి గ్రామంలోని గిరిజనులకు తాగునీరు అందించనున్నారు.



మోటారు బిగిస్తున్న దృశ్యం

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



సారవకోట: కూర్మనాథపురంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సారవకోట/జలుమూరు: గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం సారవకోట మండలంలోని కూర్మనాథపురం, పెద్దలంబ, కిడిమి, కుమ్మరిగుంట, తొగిరి పంచాయతీల్లోని పలు గ్రామాల్లో, జలుమూరు మండలంలోని పాగోడు, యలమంచిలి, గొటివాడ తదితర గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు శంకుస్థాపన చేశారు. ఎంపీపీలు చిన్నాల కూర్మినాయుడు, వాన గోపి, ఎంపీడీఓలు మోహన్ కుమార్, ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, పలువురు అధికారులు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'మా ఊరోడే'



మెళియాపుట్టి మండలంలోని జలకలింగుపురం, ఇతర గ్రామాల పరిసర ప్రాంతాల్లో 'మా ఊరోడే' చిత్రం యూనిట్ మంగళవారం సందడి చేసింది. చక్కటి పల్లెటూరి కథతో, పల్లెల్లో జరుగుతున్న యదార్థ గాథల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని సమర్పకులు సలాన చిరంజీవి తెలిపారు. మంగళవారం ఓ సన్నివేశాన్ని జలకలింగుపురం గ్రామ శివార్లలో చిత్రీకరించారు. మూల తాతయ్య మాస్టారు రచన, అమ్మ రామకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. కుమార్ నాయక్ నిర్మాణంలో తెరకెక్కుతున్నట్లు చిరంజీవి తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రవెల్లిమోహన్, డీఓపీ యశోధ, నటులు నిహాల్ రెడ్డి, తోట సింహాచలం, విష్ణుమూర్తి, కనకమ్మ, మాధవి తదితరులు ఉన్నారు. - మెళియాపుట్టి